
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

బుధవారం 21 మే 2025

విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి

- సురేష్, వ్యవసాయాధికారి ఇల్లంతకుంట



ఆంధ్రజ్యోతి : విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

వ్యవసాయాధికారి : రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో లైసెన్స్ కలిగి ఉన్న డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేసి తప్పనిసరిగా రసీదులను తీసుకొని భద్రపర్చుకోవాలి.

ఆంధ్రజ్యోతి : మండలంలో ఇప్పటి వరకు ఎంతమంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు?

వ్యవసాయాధికారి : మండలంలోని ఆయా గ్రామాల్లో రైతు వేదికల్లో నమోదు చేస్తున్నాం. ఇప్పటి వరకు 2700మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోగా, ఈనెల చివరి వరకు ప్రక్రియ కొనసాగుతుంది.

ఆంధ్రజ్యోతి : రైతులు వరికొయ్యలు తగలబెట్టడం ద్వారా కలిగే నష్టం ఏమిటి?

వ్యవసాయాధికారి : రైతులు వరికొయ్యలు తగలబెట్టడం ద్వారా భూమిలోని సూక్ష్మ క్రిములు చనిపోతాయి. పర్యావరణం కాలుష్యం అవుతుంది. వరికొయ్యలను నేలలోనే కలియదున్నడం మంచిది.

ఆంధ్రజ్యోతి : రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే ఏం చేయాలి?

వ్యవసాయాధికారి : మేలైన విత్తనాల ఎంపికతో పాటు సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి. వ్యవసాయ శాఖ సూచనల మేరకు ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడాలి.

- ఇల్లంతకుంట (ఆంధ్రజ్యోతి)

ఈ-శ్రమ్‌పై నిర్లక్ష్యం



- ఎన్నో ఉపయోగాలున్నా నమోదుపై అనాసక్తి
- జిల్లాలో 2.98 లక్షల మంది కార్మికులు
- కార్మికుల్లో అవగాహన కరువు



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అసంఘటిత రంగ కార్మిక వర్గాలకు ఎన్నో ప్రయోజనాలతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్‌పై రాజన్న సిరిసిల్ల జిల్లాలో అనాసక్తి కనబడుతోంది. కార్మికుల్లో అవగాహన కల్పించడంలోనూ విఫలమవుతున్నట్లుగా విమర్శలు ఉన్నాయి. నాలుగేళ్ల దగ్గర పడుతున్నా ఈ-శ్రమ్ నమోదు నామమాత్రంగానే ఉంది. 2021 ఆగస్టు నుంచే ఈ-శ్రమ్ నమోదు ప్రక్రియ మొదలైనా నిర్లక్ష్యంగానే కొనసాగుతోంది. 16 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉండి అసంఘటిత రంగంలో పనిచేస్తున్న శ్రమజీవులందరూ ఈ-శ్రమ్ నమోదుకు అర్హులు. ఈ-శ్రమ్‌లో చేరిన కార్మికులకు 12 అంకెల ప్రత్యేక యూనివర్సల్ ఐడెంటిఫికేషన్ నంబరుతో కేంద్ర ప్రభుత్వం గుర్తింపు కార్డును అందిస్తుంది. నమోదు చేసుకున్న ప్రతి కార్మికుడికి ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద కార్మికుడు మరణించినా, ప్రమాదాల్లో అంగవైకల్యం చెందిన బీమా సౌకర్యం వర్తిస్తుంది.

కేంద్ర బడ్జెట్‌లోనూ ఈ-శ్రమ్‌పై ప్రత్యేక కేటాయింపులు జరిగాయి. అసంఘటిత రంగ కార్మికులకు భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ పథకాలు వర్తింపజేయడానికి ప్రామాణికంగా ఉంటుంది. ఇందులో వ్యవసాయ కూలీలు, అడ్డా కూలీలు, మత్స్యకారులు, భవన నిర్మాణ రంగాల్లో పని చేసే కార్మికులు వడ్డెరులు, సెంట్రింగ్, ప్లంబింగ్, సానిటరీ, పెయింటింగ్, ఎలక్ట్రీషియన్, వెల్డింగ్, ఇటుక బట్టీ, మరమగ్గాలు, చేనేత కార్మికులు, బీడీ కార్మికులు, ఉపాధిహామీ కూలీలు, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, పాడి రైతులు, ఆటోడ్రైవర్లు, కూరగాయల, పండ్ల విక్రేతలు, టైలరింగ్, స్వర్ణకారులు, బ్యూటీపార్లర్‌లో పనిచేసే కార్మికులు, కొరియర్‌బాయ్స్, విద్యావలంటీర్లు ఇలా వివిధ రంగాలకు సంబంధించిన కార్మికులు ఈ-శ్రమ్‌కు అర్హులే. ఈపీఎఫ్, ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ లేనివారందూ నమోదు చేసుకునే వీలు ఉంది.

● జిల్లాలో 68,739 మంది నమోదు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 5,52,037 మంది జనాభా ఉండగా, కార్మికులు 2 లక్షల 98 వేల 663 మంది ఉన్నారు. ఇందులో ప్రధాన కార్మికులు 2,53,918 మంది ఉన్నారు. వీరిలో వ్యవసాయ రంగంలో రైతులు 66,751 మంది, వ్యవసాయ కూలీలు 1,01,737 మంది, కుటీర పరిశ్రమ కార్మికులు 46,647 మంది, ఇతర రంగాల్లో 83,528 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో ఇప్పటివరకు 68,739 మంది ఈ-శ్రమ్‌పై నమోదు చేసుకున్నారు. ఎస్ఎస్‌కే ద్వారా 693మంది, సీఎస్‌సీ ద్వారా 35,940, వ్యక్తిగత రిజిస్ట్రేషన్లు 32,057, మేనేజ్‌మెంట్‌ల

మిగతా 8లో

చల్లగా చూడమ్మా..

- బద్ది పోచమ్మకు బోనం మొక్కులు
- క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు



బద్ది పోచమ్మ ఆలయం ఎదుట నెలకొన్న భక్తుల రద్దీ

7

భూముల స్వభావాలను బట్టి పంటలు ఎంపిక చేసుకోవాలి

- ముస్కానిపేటలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త

8

చట్టాలపై కార్మికులు అవగాహన పెంచుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి రాధిక జైస్వాల్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి రాధిక జైస్వాల్

సిరిసిల్ల క్రైం, మే 20(ఆంధ్రజ్యోతి): చట్టాలపై కార్మికులు అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి రాధిక జైస్వాల్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద నాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత కార్మికులకు తమ హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. ప్రతి చేనేత కార్మికుడికి భద్రత ఉండాలన్నారు. కార్ఖానలో పని చేసే కార్మికులకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, పిల్లలకు విద్య, వైద్యం తదితర సౌకర్యాలు కలిగి ఉండాలన్నారు. ఇవేవి లేకున్నా కార్మికులకు రక్షణ ఉండదన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు అనేక పథకాలు నెలకొల్పారన్నారు. వీటిని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కలిగి ఉండాలన్నారు. వీటన్నింటిని కార్మికులకు చేరువయ్యే విధంగా కంపెనీ యజమాన్యాలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కంపెనీల్లో పనిచేసే మహిళా కార్మికులకు భద్రత తప్పనిసరన్నారు. కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉచిత న్యాయం కోసం న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు. ఒక దరఖాస్తుతో మీకు ఉచిత న్యాయం అందుబాటులో ఉంటుందన్నారు. ఏదైనా సమస్య ఉంటే దరఖాస్తు చేసినచో వెంటనే న్యాయవాదిని కేటాయించి ఆ సమస్య పరిష్కారం వైపు న్యాయసేవాధికార సంస్థ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, ఆడెపు వేణు, కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అన్నదాతల అభ్యున్నతికి పెద్దపీట



జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు

ఎల్లారెడ్డిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డిలు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు కోరుట్లపేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విత్తనాల దుకాణాల ద్వారా మంగళవారం జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరా బేగం, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ఎరువులు, విత్తనాలను అందిస్తోందన్నారు. గ్రామాల్లో మహిళా సంఘాల ప్రతినిధులకు దుకాణాలను కేటాయించి వారి ఆర్థికాభివృద్ధితో పాటు రైతులకు మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకుందన్నారు. 30 కిలోల జీలుగా విత్తనాల సంచిని రాయితీపై రూ.2137లకు అందిస్తోందన్నారు. రైతులు రాయితీ జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, దేవానందం, శ్రీనివాస్, ఆంజనేయులు, బాల్‌రెడ్డి, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, లింగారెడ్డి, బుచ్చాగౌడ్, బాబు, గౌస్, గ్రామైక్య సంఘం మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పుణ్యక్షేత్రానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు

- బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



బస్సును ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్‌లు

వేములవాడ కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు, ప్రతి పుణ్యక్షేత్రం బస్సు వేసే ప్రయత్నం కొనసాగుతోందని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలుగు ప్రజల అభీష్టం మేరకే వేములవాడ-ముంబైకి బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వేములవాడ రాజన్న ఆలయ ఆవరణలో వేములవాడ-ముంబై రెండు ఏసీ బస్సులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేములవాడకు వచ్చిన మంత్రి ముందుగా వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చారు. ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రాజన్నను దర్శించుకున్నారు. అనంతరం వేములవాడ-ముంబై బస్సులను ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముంబై పర్యటనలో భాగంగా వెళ్లిన సమయంలో అక్కడున్న తెలుగు వారు తమకు ఆర్టీసీ బస్సుల సౌకర్యం కావాలని తెలుపడంతో తన దృష్టికి తీసుకువచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు, తెలుగు ప్రజలు ఎక్కడున్న వారికి సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని, దానికి అనుగుణంగానే రెండు ఏసీ లహరి బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నామన్నారు. ముంబైలో వున్న తెలంగాణ బిడ్డల ప్రయాణానికి ఇబ్బందులు తలేత్తకుండా ఉండాలని అక్కడి ప్రజల అభీష్టం మేరకే బస్సు సౌకర్యం కల్పించామని, ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12.30గంటలకు వేములవాడ నుంచి ముంబైకి బయలుదేరి తెల్లవారుజామున 4.45గంటలకు ముంబై చేరుకుంటుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం ఇంటి గంటకు ముంబై నుంచి బయలుదేరి మరుసటిరోజు తెల్లవారున 5గంటలకు వేములవాడ చేరుకుంటుందన్నారు. అడుగగానే నెల రోజుల్లో బస్సులను ఏర్పాటు చేసి మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం రేవంత్‌రెడ్డికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వేములవాడ రాజన్న ఆలయ ఆరణ నుంచి బస్సులో తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండు వరకు బస్సులో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మహేష్ బి. గీతే, ఏఎస్పీ శాఏషాద్రినిరెడ్డి గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాణ, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ డిపో మేనేజర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ తదితరులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

కోనరావుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : యువత చదువుతో పాటు క్రీడల్లో వారి సత్తా చాటాలని వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్ అన్నారు. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో మంగళవారం కేపీఎల్ క్రికెట్ క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, దేహదారుఢ్యం స్నేహ సంబంధాలు పెంపొందుతాయని అన్నారు. జాతీయ స్థాయిలో ఎదగాలని కోరారు. క్రీడాకారులకు తన వంతు సహాయం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కెంద గంగాధర్, మల్యాల దేవయ్య తదితరులు ఉన్నారు.

నేడు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని తహసీల్దార్ సుజాత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డిలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

మెరుగైన బోధనకు కార్యాచరణ

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం తనిఖీ



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు పటిష్ట కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల వేసవి శిక్షణ కార్యక్రమ శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ స్వయంగా పలు సబ్జెక్ట్‌లపై శిక్షణలోని అంశాలను బోధించారు. ఈ సందర్భంగా సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ పిల్లలు గణితం. ఏఐ టూల్స్‌లో వెనకబడకుండా వినూత్న పద్ధతులలో వారికి అర్థమయ్యేలా బోధన సాధించాలన్నారు. నూతనబోధన పద్ధతులు పిల్లలకు బోధించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.విద్యార్థులు నిత్యం పాఠశాలకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని పిల్లలు గణిత పరిజ్ఞానంపై అధిక దృష్టి సాధించే విధంగా దృష్టి సారించాలని, వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గణితంలోని వివిధ కాన్సెప్ట్‌లపై ఎక్కువ ప్రశ్నలు అభ్యాసన చేయించాలని, వివిధ సమస్యలను ఎలా పరిష్కరించాలో విద్యార్థులు స్వయంగా ప్రయత్నించేలా ప్రోత్సహించాలని అన్నారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించినప్పటికి ఇంటర్‌లో అధికంగా వైఫల్యం చెందుతున్నారన్నారు. విద్యార్థులను ముందునుంచే బలోపేతం చేస్తే వైఫల్యాలను నిరోధించవచ్చని అన్నారు. సమాజంలో మంచి పునాది ఉండాలంటే మంచి విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఉపాధ్యాయులు ఐదు రోజుల పాటు వివిధ అంశాల్లో శిక్షణ అందుకొని చిత్త శుద్ధితో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్‌రావు ఉన్నారు.

23న జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

సిరిసిల్ల టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఈనెల 23 శుక్రవారం జిల్లాస్థాయి సబ్ జూనియర్స్(బాలబాలికల) అథ్లెటిక్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 25 మంది క్రీడాకారులను ఎంపిక చేసి జూన్ 1న హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్(బాలబాలికల) పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీలో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో ఎంపిక పోటీలో పాల్గొన్నాలని తెలిపారు. వివరాలకు 9440852285 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కంచర్లలో ఉచిత వైద్య శిబిరం



రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి రజిత

వీర్నపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచర్లలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత వీర్నపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్‌ను, మందుల నిల్వలను పరిశీలించి అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కంచర్లలోని ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించి సర్వే రికార్డులను, ఐఆర్ఎస్‌స్ప్రే, ఇళ్లలో వేసిన రికార్డులను, జ్వర వ్యాధిగ్రస్తుల నుంచి తీసుకున్న బ్లడ్ శాంపిల్స్‌లను పరిశీలించారు. జ్వరంతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులు ఉచిత వైద్యశిబిరంలో నమోదు కాలేదని, జ్వరాలు తగ్గుముఖం పట్టాయని తెలియజేశారు.

మేకల షెడ్డును పరిశీలించిన జిల్లా వెటర్నరీ అధికారి



మేకల షెడ్డును పరిశీలిస్తున్న జిల్లా వెటర్నరీ అధికారి రవీందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం రైతు బజారు, కార్గిల్ లేక్ వద్ద ఉన్న మేకలు, గొర్రెలను కట్(స్లాటర్‌హౌస్) చేసే షెడ్డులను మంగళవారం జిల్లా వెటర్నరీ అధికారి రవీందర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి పరిశీలించారు. మటన్ విక్రయదారులైన కొంతమంది వ్యాపారులను పిలిపించి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి, స్వరూపతిరుపతిరెడ్డి మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలోని రైతు బజార్‌లో మటన్ విక్రయాలు చేయడానికి అన్ని సౌకర్యా లు కల్పిస్తామన్నారు. మటన్ అమ్మకాలు రైతు బజార్‌లోనే విక్రయించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దుబాల వెంకటేశం, ఎండీ ఖాజామొయినొద్దిన్, నక్క నర్సయ్య, జగన్, అనుముల శైలజ, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

లిక్కర్ ధరల పెంపు అమలు..

- ఫుల్ బాటిల్‌పై పెరిగిన ధర రూ.40
- ఎక్సైజ్ శాఖకు అదనంగా రూ.1.50కోట్ల ఆదాయం

సిరిసిల్ల క్రైం, మే 20(ఆంధ్రజ్యోతి): లిక్కర్ ధరల పెంపు అమలులోకి వచ్చింది. మద్యం ధరలు పెంచుతూ ఎక్సైజ్‌శాఖ ఈనెల 19న ఉత్తర్వులు జారీచేసింది. ఒక్కో ఫుల్ బాటిల్ ధర రూ.40, హాఫ్ బాటిల్ ధర రూ.20, క్వార్టర్‌కు రూ.10ధర పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతి బ్రాండెడ్ ఫుల్ బాటిల్‌పై రూ.40 ధర పెరిగింది. దీంతో మద్యం ప్రియులకు అదనపు భారం పడుతుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎక్సైజ్ శాఖకు ప్రతి నెల అదనంగా రూ.1.50కోట్ల ఆదాయం సమకూరనుంది. జిల్లాలో 48వైన్ షాప్‌లు, 6బార్ అండ్ రెస్టారెంట్‌లు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి నెల రూ.43 నుంచి 50కోట్ల వరకు మద్యంపై ఆదాయం సమకూరుతుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్‌శాఖకు మద్యం అమ్మకాలద్వారా ఏడాదికి దాదాపు రూ.600 కోట్ల ఆదాయం వస్తుంది. పెరిగిన మద్యం ధరల ప్రకారం ప్రతిఏటా రూ.18 కోట్ల ఆదాయం అదనంగా సమకూరనుంది.

వేసవిలో బీర్ల అమ్మకాల జోరు

జిల్లాలో వేసవి సందర్భంగా చల్లని బీర్ల అమ్మకాలు జోరందుకున్నాయి. జిల్లావ్యాప్తంగా మార్చి, ఏప్రిల్, మే 20లోగా 1,65,700బాక్సుల బీర్లు విక్రయించారు. ఎండలు దంచి కొట్టడంతో బీర్లవైపు మద్యంప్రియులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో లిక్కర్ అమ్మకాలు తగ్గి బీర్ల అమ్మకాలు పెరిగాయి. ప్రస్తుతం 60శాతం బీర్ల అమ్మకాలు, 40శాతం లిక్కర్ అమ్మకాలు సాగుతున్నాయి. మూడు నెలల్లో మద్యం ప్రియులు 19.83లక్షల బీర్లు తాగారు. ప్రతినెల 14.57 కోట్ల చొప్పున బీర్లు క్రయవిక్రయాలు సాగాయి. దీంతో 80 రోజుల్లో దాదాపు 44.63కోట్ల బీర్లు విక్రయించారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మల్యాల, మే 20(ఆంధ్రజ్యోతి): కొండగట్టు సమీపంలో ఆర్టీసీ బస్సు కారును ఢీకొంది. కరీంనగర్ వైపు నుంచి జగిత్యాలకు వెళ్తున్న కారు అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో వెనుకాల వస్తున్న వరంగల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో కారు వెనుక భాగం దెబ్బతినగా ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

ఈదురు గాలుల వర్షం

● ఇంటిపై విరిగిపడిన కరెంటు స్తంభం

గంభీరావుపేట మే 20 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలుల వర్షం కురిసింది. అరగంట పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో ఓ ఇంటిపై విద్యుత్ స్తంభం విరిగిపడింది. విద్యుత్ స్తంభం విరిగిపడ్డ సమయంలో ఆ ఇంట్లో కుటుంబ సభ్యులు ఉన్నారు. దీంతో తృటిలో ప్రమాదం తప్పింది. విద్యుత్ నిలిచిపోవడంతో కాలనీ అంధకారంగా మారింది. విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉందని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని కాలనీవాసులు తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని ముందే తీసేసి కొత్త స్తంభం ఏర్పాటు చేసినట్లయితే ఇప్పుడు ఇలా జరిగి ఉండేది కాదని కాలనీవాసులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత సెస్ సిబ్బంది విరిగిన పాత స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం కేసు నమోదు


శ్రీనివాస్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యంపై మంగళవారం ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్ఆఫీసర్ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కోనేటి శ్రీనివాస్(38) ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

రెండు బైకులు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కరీంపేట గ్రామ శివారులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన సుధాకర్ తన ద్విచక్రవాహనంపై కూతురు సంధ్యతో కలిసి బొమ్మనపల్లికి వెళ్తున్నారు. మొగిలిపాలెం గ్రామానికి చెందిన చిన్నబోయిన రాహుల్ మొగిలిపాలెం నుంచి కొండపలకలకు వస్తుండగా కరీంపేట శివారులో బ్రిడ్జి మూల మలుపు వద్ద రాహుల్ సుధాకర్ బైక్‌ను ఢీకొట్టడంతో సుధాకర్‌కు కుడి కాలికి, తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెల మృతి

కథలాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని అంబారిపేటలో మంగళవారం జవ్వాజి ఆదిరెడ్డి అనే రైతుకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. గేదెలను గ్రామ శివారులో మేపు కోసం తీసుకు వెళ్లాడు. అనూహ్యంగా ట్రాన్స్‌ఫార్మర్ వైపు మేత కోసం వెళ్లి విద్యుదాఘాతానికి గురైందని రైతు వాపోయాడు. దీంతో లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధిత రైతు పేర్కొన్నాడు. ప్రభుత్వం తనకు నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

●కథలాపూర్: మండలంలోని అంబారిపేటలో మంగళవారం జవ్వాజి ఆదిరెడ్డి అనే రైతుకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. గేదెలను గ్రామ శివారులో మేత కోసం తీసుకెళ్లాడు. అనూహ్యంగా ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్లిన గేదె విద్యుదాఘాతానికి గురైందని రైతు వాపోయాడు. దీంతో లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధిత రైతు పేర్కొన్నాడు. నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

దళితబంధు రెండో విడత నిధులు విడుదల చేయాలి

వీణవంక,మే20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళిత బంధు రెండో విడత నిధులను లబ్ధిదారుల అకౌంట్ల ఫ్రీజింగ్ ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలని జనతాదళ్ సెక్యులర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ దళితబంధు పైలెట్ ప్రాజెక్ట్ హుజూరాబాద్ నియోజకవర్గంలో గత ప్రభుత్వం మొదలు పెట్టిన లబ్ధిదారులకు మొదటి విడుత నిధులు విడుదల చేశాక వివిధ రకాల యూనిట్స్ పెట్టుకుని రెండో విడత నిధులు రాక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో కొటేషన్‌ల పేరిట దళారులు కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల ఫ్రీజింగ్ ఎత్తివేసి వెంటనే దళితులను ఆదుకోవాలని కోరారు.

కొండంత పండుగ..


ఉత్సవమూర్తుల యాగశాల ప్రవేశం

● కొండగట్టులో ప్రారంభమైన హనుమాన్ జయంత్యుత్సవాలు
● అంజన్నకు ప్రభుత్వం తరపున భద్రాచలం రాములోరి పట్టువస్త్రాలు
● ప్రారంభమైన త్రయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞం

మల్యాల, మే 20(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో మూడు రోజుల పాటు నిర్వహించే హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉత్సవమూర్తులకు స్వస్తి వచనము, రక్షాబంధన ము, దేవతాహవనం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం యాగశాల ప్రవేశం చేశాక స్థాపిత దేవ తారాదన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాలలో త్రయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, భద్రాచలం ఈవో రమాదేవి, స్థానాచార్యులు తిరుకోవెల కపీందర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేందర్‌ప్రసాద్, రఘు ఉపప్రధాన అర్చకులు చిరంజీవస్వామి, మారుతీ, ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర

కొండగట్టు అంజన్నకు ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, భద్రాచలం రామాలయం నుంచి ఆలయ ఈవో ఎల్. రమాదేవి తదితరులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వైజంక్షన్ నుంచి శోభాయాత్ర నిర్వహించగా పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. కళాబృందాలు 108 దీపాల ప్రదర్శన, ఒగ్గు డోలు, కోలాటం, డప్పు నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాకారుల ప్రదర్శనలతో ఆధ్యాత్మికత ఉట్టిపడింది.

తరలిరానున్న దీక్షాపరులు

గురువారం జరిగే పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల కోసం భక్తులు, అంజన్న దీక్షాపరులు వాహనాలు, కాలినడకన కొండగట్టుకు వస్తున్నారు. మంగళవారం కొండ పైన దీక్షాపరులు సందడి అంతంత మాత్రమే కాగా, బుధవారం సాయంత్రం నుంచి భక్తుల రద్దీ పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జయంతి సందర్భంగా ఆలయాన్ని, యాగశాలను పూర్తి స్థాయిలో అలంకరించకపోవడంపై పలువురు భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.



కళాకారుల ప్రదర్శనలు




పట్టువస్త్రాలను తీసుకువస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, భద్రాచలం ఈవో రమాదేవి, కొండకు వస్తున్న దీక్షాపరులు, స్వామివారి శోభాయాత్ర

టెక్స్‌టైల్ డిప్లొమా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

- టెస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు



మాట్లాడుతున్న టెస్కో జీఎం అశోక్‌రావు

సిరిసిల్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): చేనేత, టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టెస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు అన్నారు. మంగళవారం సిరిసిల్లలో చేనేత జౌళి శాఖ కార్యాలయంలో కొండ లక్ష్మణ్‌బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో ప్రవేశాలు పొందే విధి విధానాలు డిప్లొమా కోర్సులు, ఉపాధి మార్గాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అశోక్‌రావు మాట్లాడుతూ 2025 - 26 సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరంలో చేరడానికి చేనేత టెక్స్‌టైల్‌కు సంబంధించి 60 సీట్లు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి పాసై జనరల్ విద్యార్థులు 15 నుంచి 23 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 15 నుంచి 25 మధ్య వయస్సు కలిగిన విద్యార్థులు చేరవచ్చని వివరించారు. డైరెక్ట్‌గా రెండో సంవత్సరం ఇంటర్ ఎంపీసీ, ఒకేషనల్‌కు సంబంధించిన విద్యార్థులు చేరవచ్చని జనరల్ విద్యార్థులు 15 నుంచి 23 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ 25 సంవత్సరాల లోపు ఉండాలని అన్నారు. ఫీజు సంవత్సరానికి రూ.4,250 ఉంటుందని విద్యార్థులు నెలవారీగా రూ 2500 ఉపకార వేతనాలను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల సోదాలు


బేకరీలో తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ అనూష

జగిత్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని యావర్ రోడ్డులో అటవీశాఖ కార్యాలయం సమీపంలో గల ఓ ప్రముఖ బేకరీలో మంగళవారం ఫుడ్ స్టేఫ్టీ అధికారులు సోదాలు నిర్వహించారు. బేకరీలో కాలం చెల్లిన, నాణ్యత లేని ఆహార పదార్థాలను, ఫంగస్ గల ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ అనూష ఆధ్వర్యంలో సిబ్బంది సోదాలు చేశారు. బేకరీలో నిల్వ ఉంచిన పలు ఆహార పదార్థాలను పరిశీలన జరిపారు. అనుమానం గల పలు ఆహార పదార్థాలను ల్యాబ్ పరీక్షల నిమిత్తం తీసుకవెళ్లారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ అనూష మాట్లాడుతూ ప్యాకింగ్‌తో విక్రయించే ప్రతీ ఆహార పదార్థాలు నాణ్యత ఉండాలన్నారు. ప్యాకింగ్‌పై వాటి తయారీ తేదీ, బ్యాచ్ నంబరు, ధర, ఎప్పటివరకు వినియోగించవచ్చన్న తదితర వివరాలను తప్పనిసరిగా ముద్రించాలని సూచించారు. ఈ కార్యక్రమంల ఫుడ్ సేఫ్టీ శాఖకు చెందిన పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


పొత్తూరులో రాస్తారోకో చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని రాస్తారోకో

ఇల్లంతకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తిచేయాలని రైతులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. మండలంలోని పొత్తూరు గ్రామానికి చెందిన రైతులు బస్టాండ్ వద్ద నిరసన చేపట్టగా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు సంఘీభావం ప్రకటించారు. రైతుల రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్దం శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పట్నం అశ్విని‌శ్రీనివాస్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కదురు శేఖర్, రైతులు రాజు, నారాయణరెడ్డి, మల్లారెడ్డి, రాజయ్య, నర్సయ్య, గోవర్ధన్‌రెడ్డి, సాంబశివరెడ్డి, మోహన్‌రెడ్డి, గౌరయ్య, రాజయ్య, రవి, గుంటి అంజయ్య, సాగర్, రాజమల్లయ్య, మహేష్ పాల్గొన్నారు.

నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్న వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలి

సుభాష్‌నగర్, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ, గురుకుల, కళాశాల వసతి గృహాలకు నాసిరకం సరకులు సరఫరా చేస్తున్న వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలని కుల వివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్స్‌లో విద్యార్థులకు నాసిరకం సరుకులు, సరఫరా చేయడం వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని ఆరోపించారు. బి అంజయ్య, బి చిరంజీవి, బి సంతోష్ అనే వారు సుమారు అత్యధిక హాస్టళ్లకు కూరగాయలు, చికెన్, పండ్లు, గుడ్లను సరఫరా చేస్తున్నారని తెలిపారు. గతంలో సరఫరా చేసిన కూరగాయలు, పండ్లు, చికెన్, గుడ్లు నాసిరంగా ఉండడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. వారిని బ్లాక్‌లిస్టులో పెట్టి వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు.

రెండు గ్రామాల మధ్య చేపల పంచాయతీ

● 23 మందిపై కేసు నమోదు

ఇల్లందకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని మల్యాల, వాగొడ్డురామన్నపల్లె గ్రామాల మధ్య చేపల పంచాయతీలో 23మందిపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్ఐ పిట్ల దిలీప్‌కుమార్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్యాల, గ్రామ శివారులోని చింతల చెరువులో వాగొడ్డు రామన్నపల్లె గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్థులు చేపలు పట్టుకునేవారు. గత ఏడాది మల్యాల గ్రామస్థులు తమ చెరువులో తామే చేపలు పట్టుకుంటామని వాగొడ్డు రామన్నపల్లె వారిని అడ్డుకున్నారు. దీంతో వాగొడ్డు రామన్నపల్లె గ్రామస్థులు జిల్లా ఫిషరిస్ అధికారుల నుంచి చింతల చెరువులో చేపలు పట్టుకోవడానికి ఆర్డర్ తీసుకు వచ్చారు. చెరువులోని చేపలు పట్టడానికి వాగొడ్డు రామన్నపల్లె వారికే హక్కులు ఉన్నాయని తహసీల్దార్ తేల్చిచెప్పారు. ఈ క్రమంలో ఇటీవల వాగొడ్డు రామన్నపల్లెకు చెందిన ముదిరాజ్ కులస్థులు చేపలు పడుతున్న క్రమంలో మల్యాల గ్రామస్థులు అక్కడికి చేరుకొని గొడవ చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి ఇరువర్గాలను శాంతింపజేశారు. తమ చేపల వలలు, 95 వేల రూపాయల విలువ చేసే చేపలను దొంగిలించారని వాగొడ్డు రామన్నపల్లె గ్రామస్థులు మల్యాలకు చెందిన 23మందిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.


కాలువ పనులు అడ్డుకుంటున్న రైతు దయ్యాల నర్సయ్య

ఎల్లంపల్లి కాలువ పనులను అడ్డుకున్న రైతు

- నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్

రుద్రంగి, మే 20 (ఆంధ్రజ్యోతి) : తన భూమికి నష్ట పరిహారం ఇవ్వకుండానే అధికారులు ఎల్లంపల్లి కాలువ పనులు చేస్తున్నారని దయ్యాల నర్సయ్య అనే రైతు కాలువ పనులను అడ్డుకున్నాడు. మండల కేంద్రం శివారులోని కలికోట సూరమ్మ చెరువుకు వెళ్లే ఎల్లంపల్లి కాలువ పనులు కొనసాగుతున్నాయి. అయితే కాలువ పనులు జరగకుండా నర్సయ్య కాలువ మధ్యలో కూర్చొని నిరసన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా రైతు దయ్యాల నర్సయ్య మాట్లాడుతూ సర్వే నంబర్ 333లో 20 గుంటల భూమి ముంపునకు గురవుతున్నట్లు తెలిపాడు. తమ భూములకు నష్టపరిహారం చెల్లించకుండా కాలువ పనులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం, ఇప్పటికైనా తనకు నష్టపరిహారం అందించాలని కోరాడు.

కల్వర్టులో పడిపోయిన మినీ కంటైనర్

● అందులోనే ఇరుక్కున్న డ్రైవర్ ● బయటకు తీసిన స్థానికులు


డ్రైవర్‌ను బయటికి తీస్తున్న రెస్క్యూ టీం, స్థానికులు

తిమ్మాపూర్, మే 20, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి- నుస్తులాపూర్ గ్రామాల మధ్యలో గల కల్వర్టును ఓ మినీ కంటైనర్ ఢీకొని కల్వర్టులోకి పల్టీకొట్టి పడిపోయింది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ కాలు అందులోనే ఇరుక్కుపోవడంతో అతన్ని బయటకు తీసేందుకు సుమారు రెండు గంటలకు పైగా శ్రమించారు. స్థానికులు తెలిపిన వివ రాల ప్రకారం.. ఓ ప్రైవేటు కొరియర్‌కు సం బంధించిన మినీ కంటైనర్ హైదారాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వస్తున్న క్రమంలో మంగళవారం తెల్లవారు జామున 4.30గంటల ప్రాంతంలో డ్రైవర్ అజాగ్రత్తగా నిద్రమత్తులో వాహనం నడుపుతుండటంతో కొత్తపల్లి- నుస్తులాపూర్ మధ్యలో ఉన్న కల్వర్టులోనికి దూసుకెళ్లి బోల్తాపడింది. గమనించిన స్థానిక రైతులు ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించారు సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ పోలీసులు, ఫైర్, టోల్‌గేట్ సిబ్బంది స్థానికులు కంటెయినర్ నుంచి డ్రైవర్‌ను బయటకు తీసేందుకు చాలా శ్రమించాల్సి వచ్చింది. డ్రైవర్‌ను 108 వాహనంలో కరీంనగర్‌లోని అనుపత్రికి తరలించారు. డ్రైవర్ యాదద్రి జిల్లా, గుండాల మండలం, అనంతరం గ్రామానికి చెందిన చెరుపల్లి సాగర్(29)గా గుర్తించారు.

రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

రాయికల్, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మండలంలోని అలూరు గ్రామంలో మంగళవారం సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గిస్తూ సేంద్రియ వాడకాన్ని ఎక్కువ వినియోగిస్తూ భూమి సారాన్ని పెంచాలని, తద్వారా రైతులు లాభాలు పొందాలని సూచించారు. పచ్చిరొట్టకు సంబంధించిన జనుము, జీలుగ, పెసర, పిల్లి పెసర, అలసంద వంటి వాటిని నేలల్లో వెదజల్లి కలియదున్నాలన్నారు. అప్పుడే భూమిలో సూక్ష్మధాతువులు మంచి పంటను అందించాలంటే సత్తువ గల భూమిని తయారు చేయాలన్నారు. రసాయన ఎరువులతో భూసారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో ముక్తేశ్వర్, జిల్లా రైతు నాయకుడు మెక్కొండ రాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కారులో ఊపిరాడక యువకుడి మృతి

సిరిసిల్ల క్రైం, మే 20(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని వెంకట్రావునగర్‌కు చెందిన పసునూరి రాజేశ్ (35) అనే వ్యక్తి కారులో ఊపిరాడక మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని వెంకట్రావునగర్‌కు చెందిన రాజేశ్ ఫ్రూటీ, హ్యాపీ ఫిజ్ అనే శీతలపానీయాల హెడ్‌గా పనిచేస్తుంటాడు. ఇదే క్రమంలో ఈ నెల 18న రాత్రి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారులో గల గోదాంకు స్టాక్ వచ్చిందని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి రాజేశ్ బయటకు వెళ్లాడు. ఆ రోజంతా ఇంటికి రాకుండానే సోమవారం ఉదయం 6గంటలకు అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి మళ్లీ బయటకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత తన కారును కొత్త బస్టాండ్ సమీపంలో పార్క్ చేసుకొని మద్యం సేవించి కార్ లాక్ చేసుకొని అందులోనే ఉన్న రాజేశ్ ఊపిరాడక మృతి చెందాడు. అయితే తన భర్త ఇంటికి రాలేదని బయటకు వెళ్లి చూస్తే లేకపోవడంతో అనుమానం వచ్చి సోమవారం రాత్రి 11.30 గంటలకు కారు వద్దకు వెళ్లి చూసేసరికి తన భర్త కారులోనే చనిపోయి ఉన్నాడని గుర్తించి చుట్టుపక్కలవారికి, కుటుంబ సభ్యులకు భార్య బాలమణి సమాచారం అందించింది. గత 2019 నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నాడని, ఇదే క్రమంలో అతిగా మద్యం సేవించడం వల్ల కారులో ఊపిరాడక డీహైడ్రేషన్ వల్ల చనిపోయి ఉంటాడని రాజేష్ భార్య పోలీసలుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది. తన భర్త మృతికి ఎవరిపై అనుమానం లేదని భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

దొంగ అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో చోరీ చేసి తప్పించుకొని తిరుగుతున్న దొంగను పోలీసులు పట్టుకొని సొత్తును స్వాధీనం చేసుకొని నిందితుడిని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఈరవేణి సత్యనారాయణ హమాలీ పని చేసుకొని జీవిస్తున్నాడు. ఖర్చులకు డబ్బులు సరిపోకపోవడంతో సొంత అవసరాల కోసం ఈజీగా డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేశాడు. ఈ క్రమంలో తన ఇంటి దగ్గరలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. బీరువా తాళం పగలగొట్టి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పోలీసులు చాకచక్యంగా సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గొల్లపల్లి బస్టాండ్ వద్ద పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి బంగారు లక్ష్మీహారం, నెక్లెస్, రెండు చైన్‌లను స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. సత్యనారాయణను రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన ఎస్ఐ రమాకాంత్, పీఎస్ఐ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు బాబయ్య, రషీద్, శ్రీనాథ్, శ్రీనివాస్‌లను సీఐ అభినందించారు.


నదిలో పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తులు

సరస్వతి.. నమోస్తుతే

- పుష్కరాలకు కొనసాగుతున్న భక్తుల రద్దీ
- ఆరో రోజు 50 వేల మంది పుణ్యస్నానాలు..
- నదిలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల మోహరింపు...


స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


గోదావరికి చీరె సారె సమర్పిస్తున్న భక్తులు




పూజలు చేస్తున్న భక్తులు

భూపాలపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి నది పుష్కరాలకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఎండలను సైతం లెక్కచేయకుండా జనం తరలివచ్చి సరస్వతి అంతర్వాహినిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. పుష్కరాల్లో ఆరో రోజైన మంగళవారం దాదాపు 50 వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీ శ్వర స్వామిని దర్శించుకున్నారు. రెండు రోజులుగా ఎండల తీవ్రత పెరగడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఉదయం 12 గంటల లోపు, సాయం త్రం నాలుగు గంటల తర్వాత కాళేశ్వర క్షేత్రానికి తరలి వచ్చి పుష్కరస్నానాలు చేశారు. మూడు రోజులపాటు పోటెత్తిన భక్తుల సంఖ్య రెండు రోజుల్లో కొంత తగ్గినప్పటికీ భక్తులు సెంటిమెంట్ ప్రకారం పుణ్య స్నానాలకు రాలేదని అధికారులు భావిస్తున్నారు.



మంగళవారం అష్టమి కావడంతో సాధారణంగానే ఇక్కడ పిండ ప్రదాన కార్యక్రమాలను నిలిపివేస్తారు. గురువారం నుంచి భక్తుల సంఖ్య మళ్లీ పుంజుకునే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు గత మూడు రోజుల్లో ఉత్పన్నమైన సమస్యలను పునరావృతం కాకుండా చూసేందుకు ముందస్తు చర్యలు ప్రారంభించారు. ముఖ్యంగా సరస్వతీ ఘాట్‌కు వెళ్లే దారిని మరింత విస్తరించి రేలింగ్ చేశారు. భక్తులరాక వల్ల రోడ్డు పై దుమ్మురేగకుండా ట్యాంకర్ల ద్వారా నీళ్లను చల్లు తూ క్యూరింగ్ చేస్తున్నారు. మంగళవారం పుష్కరాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎండ వేడి నుంచి రక్షణ కలిగించేలా చలువ పం దిళ్ల, తాగునీరు, ఉచితంగా మజ్జిగ ప్యాకెట్ల పంపి ణీనీ జిల్లా అధికార యంత్రాంగం చేపట్టింది. కలెక్టర్ రాహుల్ శర్మ పుష్కరాలు జరుగుతున్న ఘాట్లలో తిరుగుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఎస్పీ కిరణ్ ఖరే ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా వాహనాల రాకపోకలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించారు. పుష్కరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడడం కోసం ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీ కెమెరాల ద్వారా పరిస్థితులను సమీక్షిస్తూ పోలీసు అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు సలహాలు అందించారు.

మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి సృజన, ఇంటెలిజెన్స్ బ్యూరో ఐజీ తరుణ్ జోషి తదితరులు నదిలో పుణ్య స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గోదావరిలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా నివారించడం కోసం అధికార యంత్రాంగం నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫోర్స్(ఎన్‌డీఆర్‌ఎఫ్), సింగరేణి రెస్క్యూ బృందాలను, గజ ఈతగాళ్లను పుష్కర ఘాట్‌లో మోహరించారు.



ఏఎస్సైలకు పదోన్నతులు

కరీంనగర్ క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్‌లో పలు పోలీస్ స్టేషన్‌లలో ఏఎస్సైలుగా పని చేస్తున్న తొమ్మిది మందికి ఎస్సైలుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు పోలీసుశాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. మల్టీజోన్ నుంచి మొత్తం 22 మంది ఏఎస్సైలు పదోన్నతులు పొందారు. వీరందరిని ప్రస్తుతం జిల్లాలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే పోలీస్ స్టేషన్ల కేటాయింపు, పోస్టింగ్‌లు వెలువడనున్నాయి.

డిగ్రీ పరీక్షల్లో 8 మంది డీబార్

గణేశ్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం మాల్ ప్రాక్టీస్ చేసిన ఎనిమిది మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో నలుగురు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్దపల్లిలో ఒకరు, వాణినికేతన్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, శివాని డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఇద్దరి చొప్పున డీబార్ చేసినట్లు వివరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కరీంనగర్ క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని పద్మ నగర్ పరిధిలో మానేరు జలాశయం నీటి గుంతలో గుర్తుతెలియని వ్యక్తి (40) మృతదేహం లభ్యమైందని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. నీటి గుంతలో వ్యక్తి మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని మంగళవారం రాత్రి బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చల్లగా చూడమ్మా..

- బద్ది పోచమ్మకు బోనం మొక్కులు
- క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారికి భక్తులు మంగళవారం బోనం మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు బద్ది పోచమ్మ అమ్మ వారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఉదయాన్నే భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మ వారి ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలతో గంటల తరబడి భక్తులు క్యూలైన్‌లో బారులు తీరి ఆలయంలోకి ప్రవేశించారు. అమ్మవారికి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుని నైవేద్యాన్ని సమర్పించి పిల్లాపాపలు పాడిపంటలు చల్లగా ఉండాలని వేడుకున్నారు.


అమ్మవారి దర్శనం కోసం బోనాలతో క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న భక్తులు

చిన్నకలువలలో సీతారాముల కల్యాణం

సుల్తానాబాద్, మే 20: (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకలువల సంకట విమోచన వీరహన్‌మాన్ ఆలయంలో మంగళవారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త వంగపల్లి సుగుణాకర్‌రావు అనసూయ దేవిదంపతుల ఆధ్వర్యంలో సత్యనారాయణచార్యులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం కల్యాణం జరగగా సాయంత్రం హవనము, బలిహరణము, తీర్థగోష్టి నిర్వహించారు. బుధవారం ఆలయ ఆవరణలో సీతారామచంద్ర స్వాముల పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం జరిగే హన్‌మాన్ పెద్ద జయంతి వేడుకలకు భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.


స్వామివారి ఉత్సవమూర్తులు

బాక్సింగ్‌లో సత్తా చాటుతాం

- ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం
- 55 మంది క్రీడాకారుల హాజరు




బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న బాలబాలికలు

కరీంనగర్ స్పోర్ట్స్ మే 20 (ఆంధ్రజ్యోతి): బాక్సింగ్ రింగ్‌లో పంచ్ పవర్ చూపించడ మంటే సాధారణ విషయం కాదు. అలాంటి క్రీడలో ఆరితేరాలంటే ముందుగా ధైర్య సాహసాలు అలవర్చుకోవాలి. మంచి కండ పుష్టి కలిగి ఉన్నవారే బాక్సింగ్‌లో రాణిస్తారు. ఇటీవల కాలంలో ఒలింపిక్స్‌లో మేరీకోమ్, లవ్లీనా, విజేందర్ ప్రత్యర్థులను మట్టి కరిపించి పతకాలు సాధించారు. తెలుగు తేజం నిఖత్ జరీన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకుంది. దీంతో బాక్సింగ్ క్రీడ గ్రామస్థాయికి చేరింది. వేసవి క్రీడాశిబిరాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో బాక్సింగ్‌లో శిక్షణ అందిస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని అనేక మంది చిన్నారులు శిక్షణ పొందుతూ ప్రతిభ చాటుతున్నారు. కోచ్‌లు జి.సత్యనారాయణ, కొత్తకొండ సంపత్, జి.మురళి చిన్నారులను శిబిరంలో శిక్షణ ఇస్తున్నారు.

55 మంది చిన్నారుల హాజరు

కరీంనగర్ నగరపాలక సంస్థ, జిల్లా క్రీడా శాఖ సంయుక్తంగా కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి బాక్సింగ్ క్రీడా శిక్షణ శిబిరానికి 55 మంది క్రీడాకారులు హాజరవుతున్నారు. వీరికి కోచ్‌లు అధునాతనమైన టెక్నిక్స్ నేర్పిస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణ అందిస్తున్నారు.

నిఖత్ జరీన్ రోల్ మోడల్ జి.హరిణిశ్రీ, కరీంనగర్



బాక్సింగ్ అంటే చాలా ఇష్టం. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్ నాకు రోల్ మోడల్. ప్రపంచ చాంపియన్‌గా నిలిచి అందరి అభిమానాన్ని చూరగొంది. నేను కూడా ఆమెలా బాక్సింగ్ నేర్చుకుంటాను. అంతర్జాతీయ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు కృషి చేస్తా.

మంచి బాక్సర్‌గా ఎదుగుతా
జి.హరిహరన్, కరీంనగర్



మంచి బాక్సింగ్ క్రీడాకారుడిగా ఎదగాలన్నదే నా లక్ష్యం. అందు కోసం ఈ వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాల్లో బాక్సింగ్‌ను ఎంచుకున్నాను. కోచ్‌లు శిక్షణలో మెళకువలను నేర్పిస్తున్నారు. ఉచిత వేసవి శిబిరాలను నిర్వహిస్తున్న నగరపాలక సంస్థకు ధన్యవాదాలు.





పెట్రోల్ బంక్‌ల్లో పలు సేవలు

సౌకర్యాలు పొందడం వినియోగదారుల హక్కు

ఇల్లందకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోల్ కొట్టించుకోకపోయినా కొన్ని సేవలను వినియోగదారులు ఉచితంగా పొందవచ్చు. పెట్రోల్ బంక్‌కు వెళ్లినప్పుడు చాలా మంది తమ వాహనాలను ఇంధనం నింపించుకోవడమే కానీ అక్కడ అందుబాటులో ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయని తెలుసుకోరు. అంతేకాకుండా కొన్నిసార్లు బంక్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం, గాలి నింపడం కోసం డబ్బులు వసూలు చేయడం వంటివి చేస్తుంటారు.

- వాహనాల టైర్లలో గాలి నింపే మిషన్ తప్పనిసరిగా ఉండాల్సిందే. అక్కడ నిరంతరం ఒక వ్యక్తి అందుబాటులో ఉండి ఉచితంగా సేవలందించాలి. కస్టమర్ తన ఇష్టానుసారం ప్రకారం డబ్బులు ఇవ్వవచ్చు. డబ్బులు డిమాండ్ చేయరాదు.
- స్త్రీలకు ప్రత్యేకమైన మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలి. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్రతి బంక్‌లో శుభ్రమైన మరుగుదొడ్లు ఉండాలి.
- తాగునీటి కోసం స్వచ్ఛమైన ఆర్వో వాటర్ అందించాల్సిన బాధ్యత బంక్ యాజమాన్యందే. ఎవరైనా ఉచితంగా ఆ నీటిని వినియోగించుకోవచ్చు. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే ఉపయోగించు కునేందుకు ప్రథమ చికిత్స అందుబాటులో ఉండాలి. అత్యవసర సమయంలో ఉపయోగించుకునేందుకు ఫోన్ సౌకర్యం ఉండాలి.
- పెట్రోల్, డీజిల్ నాణ్యతపై అనుమానం ఉంటే బంక్‌లోనే పరీక్షించుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ పరీక్షలకు కావాల్సిన పరికరాలు, ఫిల్టర్ కాగితాలు అందజేయాల్సిన బాధ్యత కూడా బంక్ సిబ్బందిదే. ఇంధనం తక్కువగా వచ్చినట్లు అనుమానం వస్తే అక్కడే చెక్ చేసుకోవాలి.
- వినియోగదారుల ఫిర్యాదు కోసం ప్రత్యేకంగా పెట్టె ఏర్పాటు చేయాలి. పెట్రోల్ బంక్‌లో సరైన సౌకర్యాలు లేనట్లయితే సిబ్బంది దురుసుగా ప్రవర్తించినా సంబంధిత చమురు సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు.

భారత్ పెట్రోలియం (బీపీసీఎల్) టోల్ ఫ్రీ నంబర్ 1800224344, ఇండియన్ ఆయిల్ (ఐఓసీఎల్) 18002333555, హెచ్‌పీఎల్ 18002333555, రిలయన్స్ 18008919023 నంబర్లకు ఫోన్ చేసి మీ సమస్యను తెలియజేయవచ్చు. వినియోగదారుల హక్కులను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత. పెట్రోల్ బంక్‌ల్లో అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవడం ద్వారా మీ ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చుకోవచ్చు.

కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధిగా సురేష్

ఇల్లంతకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వెల్జీపూర్ గ్రామానికి చెందిన గండికోట సురేష్‌ను కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమిస్తున్నట్లు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మానకొండూర్ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం నియామక పత్రాన్ని అందించారు. పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లాలని ఎమ్మెల్యే సూచించినట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ వెంటకరమణారెడ్డి అధికార ప్రతినిధిగా నియామకం అయిన సురేష్‌ను అభినందించారు.

కొప్పుల అక్రమ ఆస్తుల చిట్టాను బయటకు తీస్తాం

- మిగతా మంత్రుల్లాగా ఈ ప్రాంతాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదు?
- 2014 నుంచి అక్రమ కేసులు పెట్టి రాక్షస పాలన చేసింది నీవు కాదా?
- 15 నెలల్లోనే మా ప్రభుత్వంపై ఆక్రోశం ఎందుకు?
- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, మే 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ రాష్ట్ర వ్యాప్తంగా కూడగట్టిన అక్రమ ఆస్తుల చిట్టాను బయటకు తీస్తామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధర్మారం, వెల్గటూర్ మండలాల కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలతో గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లను సందర్శిద్దామని, అక్కడి మంత్రులు చేసిన అభివృద్ధిని తోటి మంత్రిగా ధర్మపురి నియోజకవర్గాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేకపోయారో చెప్పాలని ప్రశ్నించారు.

ధర్మపురి నియోజకవర్గ డీఎంఎఫ్‌టీ నిధులు 15 వందల కోట్లు సిద్దిపేటకు, 2 వేల కోట్లు గజ్వేల్‌కు తీసుకుపోతుంటే ఎందుకు మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీష్‌రావు మేడారంలో రాత్రిళ్లు బస చేసి మన నీళ్లను సిద్దిపేటకు తీసుకపోతుంటే కొప్పుల ఎందుకు అడ్డుకోలేదని అడ్లూరి ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రిగా ఉండి నియోజకవర్గానికి చేసిన ఒక్క పని చూపించాలని ఎద్దేవా చేశారు. మీ పాలనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతీ ఒక్కరిపై అక్రమ కేసులు పెట్టారని, సామాన్య ప్రజలనుంచి నీకు వ్యతిరేకంగా వార్తలు రాసిన రిపోర్టర్ల దాక కేసులు పెట్టి వేధించావని గుర్తుచేశారు. ప్రభుత్వం వచ్చి 15 నెలల కాలంలోనే మీకు ప్రభుత్వంపై, నాపై అంత ఆక్రోశం ఎందుకని, మరో మూడు సంవత్సరాల వరకు 10 ఏండ్లలో నీవు చేయని అభివృద్ధిని నేను చేసి చూపిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.


తనపై పెట్టిన కేసుల వివరాలను చూపిస్తున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్ మండలంలోని పాశి గామలో ఇథనాల్ ప్రాజెక్ట్‌ను ప్రతిపక్ష నాయకుడిగా నేను వ్యతిరేకిస్తే నాపై అక్రమ కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై పెట్టిన నాన్ బేయిలేబుల్ కేసుల ప్రతులను సమావేశంలో అడ్లూరి ప్రదర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన రైతులకు చొప్పదండి నియోజకవర్గంలో ఎకరాకు 20 లక్షలు ఇప్పిస్తే, ఇక్కడి రైతులకు 7 లక్షల నష్టపరిహారం ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటని, మీకు మెగా కంపెనీకి ఉన్న లోపాయికార ఒప్పందం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2004 నుంచి 2023 వరకు కొప్పుల రాష్ట్ర వ్యాప్తంగా సంపాదించిన అక్రమ ఆస్తులను, హైదరాబాద్ శివారులోని స్టోన్ మెటల్ క్వారీస్ సంబంధించిన వివరాలు ప్రజలు ముందు పెడుతామన్నారు.బీఆర్ఎస్ కార్యకర్తలను రెచ్చగొట్టి మాజీ మంత్రి ఉసిగొల్పుతున్నారని, కాంగ్రెస్ కార్యకర్తలు సంయమనం పాటించి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలే బుద్ధిచెప్తారని హితకు పలికారు.

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యేక పూజలు



జడ్జి రాధిక జైస్వాల్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

సిరిసిల్ల టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం గాంధీనగర్‌లోని శ్రీభక్తాంజనేయ రుక్మిణి విఠలేశ్వర కాలభైరవ స్వామి దేవాలయంలో మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం కమిటీ సభ్యులు, మాజీ వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటి కార్యదర్శి కుడిక్యాల శంకర్, అర్చకులు గోషికొండ సత్తయ్య, దేవాలయం కమిటి సభ్యులు పంతం రవి, శ్రీపతి పరుశురాం, చిలగాని శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలో మాజీ సర్పంచ్ నర్సాగౌడ్ తన తండ్రి జ్ఞాపకార్థం తలపెట్టిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. పోటీలలో 40 జట్లు తలపడనున్నాయి. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

రుద్రంగి, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన పలువురు వివిధ కారణాల వల్ల అనారోగ్యంతో బాధపడుతుండటంతో మంగళవారం వేములవాడ నియోజకవర్గం బీజేపీ పార్టీ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు పరామర్శించారు. ఇటీవల బైక్ ప్రమాదంలో తీగల నవీన్ గాయపడగా, రాచకొండ గంగనర్సయ్య, అల్లూరి అశోక్‌లకు శస్త్రచికిత్స కాగా వారిని వికాస్‌రావు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కర్ణవత్తుల వేణు, పడాల గణేష్, బోయిని రాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.

పేదింటి వధువుకు పుస్తె, మట్టెలు పంపిణీ



వధువుకు పుస్తె, మట్టెలు అందజేస్తున్న గంగనర్సయ్య

రుద్రంగి, మే 20 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నేవూరి పద్మ - నర్సయ్య నిరుపేద కుటుంబానికి చెందడంతో కూతురు నవీన వివాహానికి రుద్రంగికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రం గంగనర్సయ్య స్వంత ఖర్చులతో పుస్తె మట్టెలు, పెండ్లి బట్టల ఖర్చులకు రూ.25వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, తర్రె మనోహర్, ఇప్ప మహేష్, మాడిశెట్టి అభిలాష్, స్వర్గం పరాందామ్, దసారి గంగారాజం గంధం మనోజ్, ఎర్రం అరవింద్, ఈర్నం నవీన్, సుద్దాల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

గంభీరావుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను గంభీరావుపేట మండలం కొత్తపల్లి శ్రీ వేణు గోపాలస్వామి ఆలయ కమిటి చైర్మెన్, సభ్యులు కరీంనగర్‌లో మంగళవారం కలిశారు. ఆలయ ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా బండి సంజయ్‌ను కోరారు. దీనిపై బండి సంజయ్ సానుకూలంగా స్పందిస్తు వచ్చే బడ్జెట్‌లో నిధులు కెటాయిస్తానని హామి ఇచ్చారు. బండి సంజయ్‌ను కలిసిన వారిలో ఆలయ కమిటి చైర్మెన్ శ్రీనివాస్‌గౌడ్, కమిటి సభ్యులతో పాటు బీజేపీ నాయకులు పర్శాగౌడ్, బీనవేని శ్రావన్‌యాదవ్, నవీన్‌యాదవ్, మన్మోహన్‌రెడ్డి, అఖిలేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

తంగళ్లపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ గ్రామ, మండల శాఖల నూతన కార్యవర్గ ఎంపికకు ఆశావహుల నుంచి ఏఐసీసీ అబ్జర్వర్లు దరఖాస్తు స్వీకరించారు. మంగళవారం తంగళ్ళపల్లి మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలంలోని 30 గ్రామాల కమిటీలకు, మండల కాంగ్రెస్ కమిటీల నియామకానికి ఏఐసీసీ అబ్జర్వర్లు ఫక్రుద్దీన్, కృష్ణారెడ్డిలు దరఖాస్తులు స్వీకరించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష స్థానానికి ప్రస్తుత మండల శాఖ అధ్యక్షుడు జలగం ప్రవీణ్‌తో పాటు మరో 15 మంది ఆశావహులు దరఖాస్తులు చేసుకున్నారు. అలాగే ప్రతి గ్రామం నుంచి అధ్యక్ష స్థానానికి సుమారు ఐదు దరఖాస్తులు వచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇల్లంతకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ నగేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు

ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉచిత ప్రవేశాల పేరిట విద్యార్థులను చేర్చుకుంటూ తల్లిదండ్రులను మోసం చేస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేశ్ డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ చట్టం, పుస్తకాల అమ్మకాన్ని అరికట్టాలని పేర్కొంటూ ఎల్లారెడ్డిపేట మండల వనరుల కేంద్రంలో ఎంఈవో కృష్ణహరికి మంగళవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాకేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రైవేటు విద్యా సంస్థలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకు రావాలని అన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, అజయ్, సాయికృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి

సిరిసిల్ల టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : పవర్‌లూం పరిశ్రమ విద్యుత్ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని కలిసి పవర్‌లూం పరిశ్రమ సమస్యలను వివరించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సీపీఐ, కాంగ్రెస్ నాయకులు, వస్త్ర వ్యాపారులు వినతిపత్రం అందించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు గుదిబండగా మారిన విద్యుత్ సమస్యను పరిష్కరించాలని మహేందర్‌రెడ్డిని సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి కోరారు. ఈ కార్యమంలో నాయకులు బండారి అశోక్, బూట్ల నవీన్, గుండ్లపల్లి గౌతమ్, గుంటుక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఇల్లంతకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు దూరం అవుతాయని వైద్యసిబ్బంది సూచించారు. మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం డ్రైడేను చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ పరిసరాలను పరిశీలించారు. తాగునీరు కలుషితం కాకుండా గ్రామపంచాయతీ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈవో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి వరుణ్, వైద్యసిబ్బంది శాంత, జవాహర్, తారాబాయి, స్వప్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రజలకు తెలిసేలా చేశాం

- ప్రతీది రాజకీయం చేయాలనే ప్రయత్నం చేస్తున్నారు - కార్యకర్తల సమీక్ష సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆర్థిక వ్యవస్థ ప్రతి పౌరుడు తెలుసుకునేలా చేశామని బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడ పట్టణంలోని స్థానిక మహాలింగేశ్వర గార్డెన్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నియోజకవర్గ బ్లాక్‌కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్యఅథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని, కొంత ఇబ్బంది ఉన్న మాటను తెలంగాణ ప్రజలకు తెలియాలని వివరించామన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ స్థానిక సంస్థల్లో విజయం సాధించాలని తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ఎవరైతే గ్రామ కాంగ్రెస్ పార్టీని నడపగలుగుతారో వారినే గ్రామశాఖ అధ్యక్షుడిగా ఎన్నుకోవాలని, మండల అధ్యక్షులుగా సమష్టి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కార్యకర్తల అందరి కృషితో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలు ప్రతి ఇంటికి తీసుకుపోవాలని అన్ని ఎన్నికల్లో పార్టీ గెలిచేలా బాధ్యత కార్యకర్తలు తీసుకోవాలన్నారు. ప్రతి పథకం పేదవాడికి అందేలాగా చేస్తున్నామని, ఇందిరా సౌర, గిరి జల వికాసం పథకం సోమవారం ప్రారంభించామన్నారు. సోలార్ ద్వారా మోటార్ సిస్టమ్ అమలు చేస్తున్నామని తెలిపారు. పేదల్లో పేదలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని, ప్రతిదీ రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారని ప్రతిపక్షాలను విమర్శించారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట అమలుచేస్తుందని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మండలాలు గ్రామాల్లో పార్టీ పునఃనిర్మాణం జరగాలని, అనుబంధ సంఘాలు, యువజన సంఘాలు బలోపేతం కావాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ నియోజకవర్గంలోని అన్ని మండలాలను అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందకు అహర్నిశలు కృషి చేస్తున్నానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు పోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి అవగాహన కల్పించాలన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణచేస్తూ ముందుకు పోతున్నామని, ప్రజా ప్రభుత్వంలో ఆలయ అభివృద్ధి, పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా స్వామి వారికి జరిగే సుప్రభాత సేవ నుంచి మొదలుకుని రాత్రి వరకు జరిగే అన్ని నిత్య పూజలు యాదావిధిగా జరుగుతాయని తెలిపారు. దేవాలయం మూసివేత అనేది ఉండదని, ఏవాలయం తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని, అభివృద్ధిలో భాగంగా మండపాన్ని విస్తరిస్తూ పనులు సాగిస్తామని, ఈనేపథ్యంలో విస్తరణ సమయంలో పలంచా కట్టెలుంటాయని, స్లాబ్‌లు వేస్తారని భక్తుల ఇబ్బందులు పడితే నిర్మాణ పనులు ఎలా చేస్తారని వివరించారు. భక్తులకు ఆర్జిత సేవలు దూరం చేయకుండా ఉండేందుకు శృంగేరి పీఠాధిపతుల సూచనల మేరకు భీమేశ్వర ఆలయంలో భక్తులకు దర్శనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి రూ.76 కోట్లతో విస్తరణ చేయాలని నిర్ణయించాలన్నారు. ప్రజలు చెప్పే ప్రతి విషయాన్ని వినడానికి సిద్ధంగా ఉన్నామని, ఎవరు చెప్పిన పాజిటివ్ కోణంలో తీసుకుని రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ ముందకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో పట్టణ, ఆయామండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేములవాడలో ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

వేములవాడ కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో హనుమాన్ సేవా సమితి ప్రతినిధి మొట్టల మహేష్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను ఘనంగా చేపట్టారు. వేములవాడ పట్టణంలోని శ్రీనగరేశ్వర స్వామి వారి ఆలయం వద్దకు హనుమాన్ దీక్ష పరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ట్రాక్టర్ ట్రాలీపై హనుమాన్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి హనుమాన్ భక్తి పాటలతో జై శ్రీరామ్.. జై హనుమాన్. అంటూ నినాదాలు చేస్తూ నృత్యాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తులు ఒంటి పైన చందనం పూసుకుని ఊరేగింపులో పాల్గొనడంతో పాటుగా పట్టణ పురవీధుల్లో హనుమాన్ జెండాలను ఏర్పాటు చేయడంతో పట్టణం కాషాయ వర్ణంతో నిండిపోయి కనిపించింది. శోభాయాత్రగా వెళుతున్న స్వాములకు ప్రజలు, మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి బీజేపి రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవిరాజు, టౌన్ సీఐ వీరప్రసాద్‌లు హాజరయ్యారు.



హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

హనుమాన్ కృప ప్రజలందరిపైన ఉండాలి..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ధైర్యానికి, బలానికి, ధీరత్వానికి నిదర్శనంగా ప్రజలు పూజించే హనుమాన్ కృప, కటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హనుమాన్ శోభయాత్రకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో నిష్ఠతో ఉపవాస దీక్ష చేపట్టిన హనుమాన్ దీక్షపరులు హనుమాన్ శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. సనాతన ధర్మాన్ని, హిందుత్వాన్ని నేటి యువత కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు.

చెత్తాచెదారంతో నిండిన మురికి కాలువలు

- పట్టించుకోని పంచాయతీ అధికారులు

గంభీరావుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీప మురికి కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది, మురికి కాలువలు చెత్తా చెదారంతో నిండి పోయాయి. పట్టించుకోవాల్సిన పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలో ఎక్కడ చూసిన మురికి కాలువల్లో చెత్త పేరుకపోయి మురికి నీరు ముందుకు వెళ్లడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మరో వైపు దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమీపంలో మురికి కాలువల దుస్థితి

మౌలిక వసతుల కల్పనపై శ్రద్ధ పెట్టాలి

- బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు నర్సింహారెడ్డి

ముస్తాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి) : అందాల పోటీల మీద పెట్టిన శ్రద్ధ మౌలిక వసతుల కల్పనలో లేదేమని ముస్తాబాద్ పట్టణ శాఖ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నర్సింహారెడ్డి మాట్లాడారు. అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ మౌలిక వసతుల కల్పనలో పెడితే బాగుండేదన్నారు. 125 సంవత్సరాలుగా చార్మినర్ దగ్గర ఉంటున్న అగర్వాల్ కుటుంబంలో 17 మంది చనిపోవడం హైదరాబాద్ చరిత్రలోనే విషాదమని, బాధిత కుటుంబ సభ్యులకు రూ.25లక్షల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. అలాగే రైతు భరోసా లేదని వడ్ల కొనుగోలు పూర్తి కాలేదని రైతన్న దిగాలుగా ఉన్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ కోఆప్షన్ మెంబర్ ఎండీ సర్వర్‌పాషా, మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, సంతోష్‌రావు, మెంగని మనోహర్, శీలం స్వామి, భరత్, జహంగీర్, తాళ్ల రాజు, ముక్క మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న ప్రభుత్వం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఉత్తర్వులు పంపిణీ

చందుర్తి, మే 20 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో 18 గ్రామాలలోని లబ్ధిదారులకు రెండో విడత కింద 503 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఉత్తర్వులు కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదలకు ఇచ్చిన మాట ప్రకారం సొంత స్థలం ఉన్న నిరుపేదలను గుర్తించి మొదటి విడతలో చందుర్తి మండలంలో 503 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. గత పాలకులు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేదలను వంచనకు గురి చేశారని అన్నారు. గత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల వ్యవధిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, మహిళలకు ఆర్టీసి బస్సులో ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రారంభించామని అన్నారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని, రైతులకు 2లక్షల వరకు పంట రుణ మాఫీ, సన్న వడ్లకు క్వింటాళ్ల 500 బోనస్, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రెసిడెన్షియల్ పాఠశాలలో 40 శాతం డైట్ చార్జీలు, 200శాతం కాస్మోటిక్ చార్జీల పెంపు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వంటి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల చేపట్టామన్నారు. గతంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాళ్ళ కోతలు ఉండేవని, నేడు ఎక్కడా కోతలు లేకుండా పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులకు 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామన్నారు. పేదల సొంతింటి కలను రేవంత్ సర్కారు నెరవేరుస్తుందన్నారు. బేస్మెంట్ దశలో లక్ష రూపాయల, గోడల దశలో లక్షా 25వేల, స్లాబ్ దశలో లక్ష 75వేలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. ఇంటి జాగాలేని నిరు పేదలకు కూడా రెండవ దశలో ఇళ్లు తప్పకుండా ఇస్తామని, ఎవరు ఆందోళనపడాల్సిన అవసరం లేదన్నారు. గతంలో పేదలకు అసైన్మెంట్ భూముల పంపిణీ చేసింది తమ హయాంలో మాత్రమేనని, గత పదేళ్లలో అసైన్‌మెంట్ కమిటీలు లేవని, నేడు మరోసారి భూ భారతిలో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో అసైన్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి నిరుపేదలకు ఇంటిస్థలాలు అందిస్తామన్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా మాట్లాడుతూ చందుర్తి మండలంలో రెండో విడత కింద 503 లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి ఉత్తర్వులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులు నిర్మాణ పనులు నెలరోజులలోపు ప్రారంభించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదిప్‌కుమార్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బొజ్జ మల్లేశం సింగిల్‌విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు చింతపంటి రామస్వామి, భీమారాజు కనకరాజు, ఎన్గంటి శంకర్, దూది శ్రీనివాసరెడ్డి, సోంతపూరి బాలు, డైరెక్టర్లు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మల్బరీ సాగుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

గంభీరావుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : మల్బరీ సాగుకు అవసర మైన చర్యలు తీసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. గంభీరావుపేట మండలం కోళ్లమద్ది గ్రామంలోని పట్టు పురుగుల పెంపకం కేంద్రంలోని ఆవరణ, మొక్కలు, బిల్డింగ్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోళ్లమద్ది గ్రామంలోని పట్టు పురుగుల పెంపకం కేంద్రం వినియోగంలోకి వచ్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూమి, చెట్లు అన్యాక్రాంతం కాకుండా చూడాలని సూచించారు. ముందుగా నీటి సౌకర్యం కోసం బోర్ వేయించాలని పేర్కొన్నారు. పట్టు పురుగుల పెంపకం కోసం సన్నద్ధం కావాలని రైతులకు ఉపయోగపడేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్ళాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి లత, అధికారులు లోకేష్, జగన్, సత్యం తదితరులు ఉన్నారు.



పట్టుపరిశ్రమ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఈ-శ్రమ్‌పై నిర్లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

ద్వారా 18మంది నమోదయ్యారు. ఇందులో ప్రధానంగా వ్యవసాయానికి సంబంధించిన కార్మికులే ఎక్కువగా నమోదయ్యారు. 36,579 మంది వ్యవసాయానికి సంబంధించిన వారిలో ఉండగా, వ్యవసాయ కార్మికులు 27,814 మంది ఉన్నారు. నమోదు తరువాత కార్మికుల లెక్కలు కూడా ప్రత్యేకంగా ఉండేందుకు డేటా బేస్ కూడా ఏర్పాటు చేశారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల నమోదు కూడా ఉచితంగానే చేస్తారు. అన్ని కామన్ సెంటర్‌లలో నమోదు చేసుకునే వీలు కల్పించారు. జిల్లాలో మాత్రం నత్తనడకగానే సాగుతోంది.

జిల్లాలో వివిధ రంగాల కింద నమోదు చేసుకున్న వారు..

వ్యవసాయం	- 36,579
నిర్మాణ రంగం	- 9,396
హస్తకళలు, తివాచీలు	- 4,284
పొగాకు పరిశ్రమ	- 3,483
అపెరల్	- 3,037
ఆటోమొబైల్, రవాణా	- 2,774
ఎలక్ట్రానిక్స్	- 1,321
హెల్త్ కేర్	- 1,271
ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్	- 1,029
వస్తు తయారీ	- 809
టెక్స్‌టైల్ హ్యాండ్లూమ్	- 568
విద్యారంగం	- 526
బ్యూటీపార్లర్‌లు	- 460
రిటైల్	- 403
ఆహార పరిశ్రమలు	- 282
టూరిజం అండ్ హాస్పిటాలిటీ	- 279
లెదర్ వర్కర్స్	- 240
జ్యువెలరీ	- 223
ప్రింటింగ్	- 201
ఇళ్లలో పనిచేసేవారు	- 159
సేవా రంగం	- 130
మైనింగ్	- 95
ప్రొఫెషనల్స్	- 88
కార్పెంటర్	- 34
వాయిద్యకారులు	- 22
ఆర్గనైజ్ రిటైల్	- 20
బ్యాంకింగ్ సర్వీసెస్	- 06
గ్లాస్ వర్క్	- 10
ప్రైవేటు సెక్యూరిటీ	- 38
మొత్తం	- 68,739

నిరాధార ఆరోపణలు సరికాదు


సిరిసిల్ల టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : నిరాధారాలతో వ్యక్తులపై ఆరోపణలు చేయడం నాయకత్వం కాదు రాజకీయ పార్టీలకు మంచిది కాదని ఆర్‌పీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో రెడ్డిమల్ల శ్రీనివాస్ మాట్లాడారు. సిరిసిల్ల కూరగాయల మార్కెట్ తొమ్మిది గుంటల స్థలం తమ సొంత భూమి అన్నారు. స్థల వివాదం కోర్టులో ఉండగా ప్రజాకోర్టు ద్వారా ప్రజల ఉపయోగకరంగా మార్కెట్ నిర్మిస్తామని తమను సమాధానపరిచి ఆ స్థలంకు బదులు మరోప్రాంతంలో నాలుగు గుంటల స్థలం కోర్టు ద్వారా ఇచ్చారన్నారు. ఆరోజు కూరగాయల మార్కెట్ కోసం 9గుంటల స్థలాన్ని మున్సిపల్ అధికారులు ఆధీనం చేసుకోవడం జరిగిందన్నారు. బీజేపీ నాయకుడు నాగుల శ్రీనివాస్ నిరాధారాలతో జిందం చక్రపాణి, అతని తమ్ముడిపై ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. స్థలంకు సంబంధించిన ఆధారాలు తమవద్ద ఉన్నాయన్నారు. నాగుల శ్రీనివాస్ పద్ధతి మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వరుణ్, మనోజ్, శ్రీధర్, పవన్, మధు, మహేందర్, గంగాధర్, రాహుల్, సాయికృష్ణ పాల్గొన్నారు.

భూముల స్వభావాలను బట్టి పంటలు ఎంపిక చేసుకోవాలి

- ముస్కానిపేటలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

ఇల్లంతకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల అనంతరం వాటి స్వభావానికి అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు రమేష్, హిందూజాలు పేర్కొన్నారు. మండలంలోని ముస్కానిపేట గ్రామంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నెలతల్లి ఆరోగ్యాన్ని కాపాడటానికి ప్రతి రైతు కృషిచేయాలన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు. పంట మార్పిడి చేయడం, నీటియాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు ఆయిల్‌ఫాం, కూరగాయల, పూలసాగులు చేయాలని సూచించారు. పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారానే మానవాళి మనుగడ సాగిస్తుందన్నారు. ఈసందర్భంగా రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి. ఉద్యనశాఖ అధికారి గోవర్దన్, ఏఈఓలు గంగ, అర్చన, రవళి, లలిత, అర్చన, అభిషేక్‌లతో పాటు రైతులు పాల్గొన్నారు.

రుద్రంగిలో ముంబై బస్సుకు స్వాగతం



చందుర్తిలో ముంబై బస్సుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

రుద్రంగి, మే 20 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ-ముంబై ఆర్టీసీ బస్సుకు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు స్వాగతం పలికారు. బస్సులో రుద్రంగికి వచ్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు పూలతో స్వాగతం పలికారు. అనంతనం ఆది శ్రీనివాస్‌ను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు తూం జలపతి, గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, మాడిశెట్టి అభిలాష్, పల్లి గంగాధర్, తర్రె లింగం, స్వర్గం పరాంధామ్, దయ్యాల శ్రీనివాస్, వంగ మనోజ్, చెలుకల శ్రీకాంత్, సూర యాదయ్య, దసారి గంగారాజం, తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి మే 20 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ నుంచి ముంబై వరకు ప్రారంభించిన బస్సు చందుర్తి చేరుకోగానే మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజలు మంగళవారం స్వాతం పలికారు. ఈ సందర్భంగా వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, పొద్దుపొడుపు లింగారెడ్డి, నాయకులు చింతపంటి రామస్వామి, బొజ్జ మల్లేశం, భీమరాజు కనకరాజు, ధర్మపురి శ్రీనివాస్, ఇందూరి మధు, చంద్రగిరి శ్రీనివాస్, దూది శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.